సాక్షి
ములుగు
మంగళవారం । 28 । మార్చి । 2023



ఈ'సారీ'లోటే!

2023-24 ఆర్థిక సంవత్సరానికి కేయూ అంచనా బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశ పెట్టబోతున్నట్లు సమాచారం.

- 8లో▶



తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి..

తీర్థయాత్రకు వెళ్లి వచ్చే సరికి ఓ వ్యక్తి ఇంట్లో దొంగలు పడి 10తులాల బంగారం.రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లారు.ఈఘటన కోనాపురంలో చోటు చేసుకుంది.

- 8లో▶

గరిష్టం/కనిష్టం
34.0^0 /24.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోగా ఉంటుంది.



న్యూస్‌రీల్

వాహనాల వేలం



ములుగు రూరల్: మండల పరిధిలోని జాకారం పోలీసు శిక్షణ కేంద్రంలో వాహనాల వేలం పాటను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు సోమవారం బహిరంగ వేలం అదనపు ఎస్పీ సదానందం ఆధ్వర్యంలో నిర్వహించగా ఎస్పీ గాష్ ఆలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాల వేలంతో ప్రభుత్వానికి రూ. 3.26 ఆదాయం సమకూరిందని తెలిపారు. వినియోగంలో లేని వాహనాలను లాట్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. మొదటి లాట్ రూ. 1.50లక్షలు, రెండో లాట్ 1.76లక్షలకు వేలం అయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ఎంటీఓ కిరణ్, డీసీఆర్‌బీ డీఎస్పీ సుభాష్‌బాబు, ఆర్‌ఐ అడ్మిన్ వెంకటనారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీందర్‌లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని లక్ష్మీదేవిపేటలో సోమవారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 55 మంది సభ్యులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ పరిశీలకుడు అవినాష్ మాట్లాడారు. మత్స్యకారులు వృత్తి నైపుణ్యతను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సర్దార్ సింగ్, మల్లేశం, జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి, లక్ష్మీదేవిపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి రెడ్డి సాంబయ్య, ఉపాధ్యక్షుడు గోండా సారంగపాణి, సంఘం డైరెక్టర్లు ఎద్దు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కోటంచ హుండీ ఆదాయం రూ.17,98,282



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇటీవల వారం రోజుల పాటు కొనసాగిన బ్రహ్మోత్సవాల అనంతరం సోమవారం ఆలయ హుండీని ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.17,98,282 రాగా మిశ్రమ బంగారం 35 గ్రాములు, మిశ్రమ వెండి 2.600గ్రాములు, తమలపాకు తోరణం పూసలతో 0.370 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ధర్మకర్తలు మంగ, విజయ పోగు సుమన్, కుమారస్వామి, లింగయ్య, రాజేశ్వర్‌రావు, శంకర్, నరేష్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాకేది.. పే స్కేల్?

అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఈజీఎస్ సిబ్బంది
- ఐకేపీ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్
- గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర



ఉపాధిహామీ పనులు చేయిస్తున్న సిబ్బంది(ఫైల్)

వెంకటాపురం(ఎం): దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. పల్లెల్లో అభివృద్ధి, పనులు సకాలంలో పూర్తవుతున్నాయంటే ఉపాధి హామీ సిబ్బందిదే కీలకపాత్ర. ఇంటి ఎదుట మొక్క నాటడం నుంచి ఇంకుడు గుంత వరకు ఈజీఎస్ సిబ్బందే బాధ్యత వహిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో వేలాది మంది కూలీలను సమన్వయం చేస్తూ, పనులు కల్పిస్తూ, గ్రామాలాభివృద్ధిలో భాగస్వాములవుతున్నా తమకు పనికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసే ఉపాధి హామీ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు ప్రకటించిన విధంగానే తమకు పీఆర్‌సీ ప్రకటించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఈజీఎస్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

17 ఏళ్లుగా..

17 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఉద్యోగులుగా కొనసాగుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. ఈజీఎస్ కింద చేపట్టే అవెన్యూ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, పశువుల, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికల నిర్మాణం, పంట కాల్వల మరమ్మతులు, కుంటల నిర్మాణం, పల్లె ప్రకృతి వనం, పంట పొలాలకు మట్టి రోడ్ల నిర్మాణం చేయించడం వంటి పనులు చేస్తున్నారు. అదే విధంగా అటవీ అభివృద్ధి పనులు, పండ్ల తోటల పెంపకం, పాఠశాలల్లో వంటగదుల నిర్మాణం, క్రీడా ప్రాంగణం, నర్సరీల్లో మొక్కల పెంపకం, హరితహారం తదితర పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో ఈజీఎస్ ఉద్యోగులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. అయినా ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా వేతనాలు అందిస్తుందని వాపోతున్నారు.

175 మంది ఉద్యోగులు

జిల్లా వ్యాప్తంగా 9 మండలాల పరిధిలో 175 మంది ఈజీఎస్ ఉద్యోగులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో 103 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా, కంప్యూటర్ ఆపరేటర్లు 22 మంది, బీఎఫ్‌టీలు ఐదుగురు, టీఏలు 29 మంది, ఈసీలు ఆరుగురు, ఏపీఓలు ఆరుగురు, ఒక జేఈ, ఒక అడిషనల్ డీఆర్‌పీ, ఒక పీఓ, ఒక ఏపీడీ పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.9 వేల వేతనం అందుతుండగా, కంప్యూటర్



ఆపరేటర్‌కు 15వేలు, టీఏకు రూ.18 వేల నుంచి 27 వేల వరకు సీనియార్టీని బట్టి వేతనం అందుతోంది. ప్రభుత్వం ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ అందజేస్తే కేడర్‌ను బట్టి సుమారు రూ.35 వేల నుంచి లక్ష రూపాయల వరకు వేతనాలు అందే అవకాశం ఉందని ఉద్యోగులు చెబుతున్నారు.

మాకు న్యాయం చేయాలి..

ప్రభుత్వం ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తించేలా ప్రభుత్వం జీఓ విడుదల చేయడం సంతోషం. వారితో పాటు ఈజీఎస్ సిబ్బందికి సైతం పే స్కేల్ వర్తింపజేయాలి. 17 ఏళ్లుగా ఈజీఎస్ పథకంలో సేవలందిస్తూ, కూలీలకు పనులు కల్పించడంలో కీలక భూమిక పోషిస్తున్నాం. ప్రభుత్వం ఈజీఎస్ ఉద్యోగులను గుర్తించి తగిన న్యాయం చేయాలి.



– పోరిక సురేష్ కుమార్, ఈజీఎస్ జిల్లా జేఏసీ వైస్ చైర్మన్

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య

కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: ఆకస్మికంగా గుండెపోటు బారిన పడిన వారి ప్రాణాలను సీపీఆర్ చేసి కాపాడవచ్చని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సీపీఆర్‌పై ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నంలో ఆరోగ్య శాఖ తరఫున శిక్షణ అందిస్తున్నట్లుగా తెలిపారు. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడే ప్రయత్నంగా 108కి సమాచారం అందించాలన్నారు. వాహనం వచ్చేంత వరకు తగిన ఆరోగ్య సూత్రాలు పాటించుకుంటూ ధైర్యం ఇవ్వాలన్నారు. ఎక్కువ మంది మెదడుకు రక్త ప్రసరణ సక్రమంగా లేకపోవడంతోనే మరణాలు సంభవిస్తున్నాయని వివరించారు. ఛాతిభాగంలో క్రమ పద్ధతిలో నొక్కడం, నోటి ద్వారా గాలి అందించడం ద్వారా గుండెపోటు వచ్చిన వ్యక్తిలో కదలిక వస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక నిపుణులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గాష్ ఆలం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేశ్, డీఆర్‌ఓ కూతాటి రమాదేవి, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

సీపీఆర్‌పై పోలీసు సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎస్పీ గాష్ ఆలం సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ట్రైనర్ రమణ సమక్షంలో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా వస్తున్న గుండెపోటుతో ఇటీవల మరణాల సంఖ్య పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కమాండెంట్ సదానందం, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీందర్, పస్రా సీఐ శంకర్, ఆర్‌ఐ అడ్మిన్ వెంకట్‌నారాయణ, ఎస్సైలు పవన్‌కుమార్, తాజుద్దీన్, వెంకటేశ్వర్‌రావు, ఓంకార్ యాదవ్, మైనిక, నిర్మల పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

వెంకటాపురం(ఎం): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో ఇఫ్తార్ విందు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆమె ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. ఇస్లాం శాంతి, ప్రేమ, దయాగుణాలను ప్రబోధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న తస్లీమా

కోతులు రాకుండా చూడాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాల లోపలికి కోతులు రాకుండా ప్రహరీపై సోలార్ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో నెలకొన్న విద్యుత్, తాగునీటి, కోతల బెడద లేకుండా చూడాలన్నారు. దగ్గరుండి పనులు చేయించాలని ఈఈ హేమలతను ఆదేశించారు. అదే విధంగా గ్రూప్ 1, ఇతర కోర్సులపై ఇప్పుడు ఇంటర్, డిగ్రీ చదువుతున్న పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అందులో డిగ్రీ పూర్తి చేసిన వారికి గ్రూప్ 1 కోర్సులపై శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో స్థితిగతులు, విద్యార్థుల సౌకర్యాలను ఏసీఎంఓ శ్రీరాములను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యూత్ ట్రైనింగ్ సెంటర్లలో సోలార్, హాస్పిటాలిటీ కోర్సులు, ఇతర కంప్యూటర్ కోర్సుల శిక్షణ ఇచ్చేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జేడీఎం కొండల్‌రావును ఆదేశించారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఎంత ఉత్తీర్ణతశాతం వచ్చిందని ఏసీఎంఓ కో ఆర్డినేటర్ రవీందర్‌ను పీఓ ప్రశ్నించగా 96 శాతం వచ్చిందని, చిన్నబోయినపల్లిలో తక్కువ ఫలితాలు వచ్చాయన్నారు. నూటికి నూరుశాతం వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు.నర్సరీలు, మామిడి తోటలతో పాటు ఇతర పండ్ల తోటలను పెంచే విధంగా చూడాలన్నారు. అలాగే ఏటూరునాగారం మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ వెంటనే ఏర్పాటు చేయాలని జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డిని ఆదేశించారు. 163 జాతీయ రహదారికి నిబంధనల వల్ల బంక్ ఏర్పాటు విషయంలో ఆలస్యం అవుతున్నదని, అందుకోసం మరో స్థలం, తగిన చర్యలు చేపడుతున్నట్లు డీఎం పీఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రాజ్‌కుమార్, ఏఓ దామోదరస్వామి, ఆర్‌సీఓలు రాజ్యలక్ష్మి, వెంకన్న, పీహెచ్ఓ భారతి పాల్గొన్నారు.



కరాటే గ్రేడింగ్ సర్టిఫికెట్ విద్యార్థికి అందజేస్తున్న పీఓ అంకిత్

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

క్రీడల్లో విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో కేజీబీవీ ఏటూరునాగారం పాఠశాల, కళాశాలలో నెల రోజుల పాటు కరాటేలో శిక్షణ పొందిన 29 మంది విద్యార్థులకు గ్రేడింగ్ సర్టిఫికెట్లను పీఓ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, కరాటే మాస్టర్ అబ్బు, కేజీబీవీ ఎస్ఓ లక్ష్మి, పీఈటీ స్వరూప పాల్గొన్నారు.

వినతులు తక్షణమే పరిష్కరించండి

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- గ్రీవెన్స్ సెల్‌లో వినతులు స్వీకరించిన కలెక్టర్

ములుగు: గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై అందించే వినతులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ.గణేశ్‌లతో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 25 వినతులు రాగా అందులో 7 రెవెన్యూకు సంబంధించినవి కాగా మరో 8 డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇతర సమస్యలపై 10 వినతులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించని పక్షంలో కారణాలను తెలుపాలన్నారు. ఆన్‌లైన్‌లో ఏ ఒక్క వినత్రి పత్రం పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు హరితహారం నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ కూతాటి రమాదేవి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీఓ కొండా వెంకయ్య, సీపీఓ ప్రకాశ్, డీఏఓ గౌస్ హైదర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, డీసీఎస్ఓ అరవింద్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మీ, డీడబ్ల్యూఓ ప్రేమలత, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీఓ సర్దార్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎంపీఐ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

గిరిజన దర్బార్‌లో..

ఏటూరునాగారం: గిరిజన దర్బార్‌లో గిరిజనులు వివిధ సమస్యలపై అందజేస్తున్న వినతులను పరిశీలించి పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశపు గదిలో గిరిజన దర్బార్ సోమవారం నిర్వహించారు. ఈ దర్బార్‌లో వినతులు పరిశీలించి పురోగతి వివరాలను తనకు అందజేయాలని పీఓ ఆదేశించారు. ఏటూరునాగారం మండలం గోగుపల్లి మొట్లగండి చెరువు కింద వందల ఎకరాల భూమి ఉందని, పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదని, రోడ్డు నిర్మించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఎట్టి ప్రకాశ్ పీఓను కోరారు. 2016లో కొండకండ్ల ప్రభుత్వ గిరిజన వసతి గృహంలో పలు అభివృద్ధి పనులు చేశామని, వాటి బిల్లులు ఇప్పటి వరకు ఇవ్వలేదని బిల్లులు ఇప్పించాలని బాధితురాలు సంధ్య కోరారు. రైతు బీమా కింద ఆర్థిక సాయం అందించాలని ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట రాంపూర్ అగ్రహార్‌కు చెందిన నరేష్ పీఓను కోరారు. ములుగు గట్టమ్మ వద్ద పూజారుల కోసం ప్రత్యేక భవనం నిర్మించాలని, అక్కడ ఎలాంటి టెండర్లు లేకుండా కొబ్బరికాయ, ప్రసాదం, పసుపు, కుంకుమ విక్రయించేందుకు ఆదివాసీ నాయకపోడు కులస్తులకు హక్కు కల్పించాలని ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ దేవాలయం అధ్యక్షుడు కొత్త సదయ్య కోరారు. అదే విధంగా పలు సమస్యలపై బాధితులు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓలు వెంకన్న, రాజ్యలక్ష్మి, ఏఓ దామోదరస్వామి, పీహెచ్ఓలు భారతి, రమణ, ఈఈ హేమలత, ఎస్ఓ రాజ్‌కుమార్, ఆర్‌ఐ శ్రీనివాస్, సెరికల్చర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పీఓకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న మోదీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

- ఎమ్మెల్యే సీతక్క
- కేంద్రం తీరుకు నిరసనగా జిల్లా కేంద్రంలో దీక్ష

ములుగు: ప్రధానమంత్రి మోదీ ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నారని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలోని గాంధీ పార్కు ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత్ జోడో యాత్రతో దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీకి మైలేజ్ పెరిగిందన్నారు. రాహుల్ గాంధీ మాటపై నిలబడే వ్యక్తి కాబట్టి తప్పుగా మాట్లాడలేదనే దృఢసంకల్పంతో ఇప్పటి వరకు పోరాడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి అప్పులకుప్పగా మారుస్తున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. మతాలు, ప్రాంతాలు, కులాలు, భాషల మధ్య బీజేపీ చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు కంబాల రవి, మండలాల అధ్యక్షులు ఎండీ చాంద్‌పాషా, చెన్నోజు సూర్యనారాయణ, ఆకుతోట చంద్రమౌళి, బండి శ్రీనివాస్, రసపుత్ సీతారాంనాయక్, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, కోటి, జయపాల్‌రెడ్డి, రేవంత్‌యాదవ్, రాజు, తిరుపతిరెడ్డి, షకీల్ పాల్గొన్నారు.

పాత నేరస్తులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న భూపాలపల్లి ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: నేరాల నియంత్రణ కోసం అసాంఘిక శక్తులతో పాటు, పాత నేరస్తులపై దృష్టి సారించాలని భూపాలపల్లి ఎస్పీ సురేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. కొత్త కేసులతో పాటు, చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా కృషి చేయాలన్నారు. ఇందుకోసం కోర్టు సంబంధిత అంశాల్లో సమర్థవంతంగా పనిచేసి, శిక్షల శాతం మరింత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట బీట్‌లు, పెట్రోలింగ్ నిర్వహించాలని, 100కు కాల్‌చేసిన వెంటనే స్పందించి ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ములుగు: బీసీ బిల్లు సాధనలో భాగంగా వచ్చే నెలలోని 3, 4 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బట్ట మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో వాల్‌పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డిపల్లి రఘుపల్లి, నాయకులు మంచర్ల నాగేశ్వర్‌రావు, ప్రొఫెసర్ కూరపాటి లక్ష్మీనారాయణ, ముంజాల భిక్షపతిగౌడ్, ఝాన్సీ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: ప్రజల కంటిచూపు సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ సూచించారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సేవలు, కంటిపరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కంటి పరీక్షలకు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా అవసరమైన తాగునీరు. టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యబృందాలు ఎప్పటికప్పుడు తమ వద్ద ఉన్న రీడింగ్ గ్లాసుల స్టాక్ వివరాలు పర్యవేక్షించాలని చెప్పారు. స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ దృష్టి లోపం సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి వారంలో ఐదు రోజులపాటు కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న శోభ

కేయూ మాజీ రిజిస్ట్రార్ లక్ష్మీపతి మృతి


లక్ష్మీపతి(ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ జువాలజీ విభాగం విశ్రాంత ఆచార్యులు, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వడ్లకొండ లక్ష్మీపతి(78) హైదరాబాద్‌లో సోమవారం మృతి చెందారు. మార్నింగ్ వాక్ చేస్తూ గుండెపోటుతో మరణించారని సమాచారం. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. లక్ష్మీపతి కేయూ రిజిస్ట్రార్‌గా 2003 నుంచి 2005 వరకు పని చేశారు. జువాలజీ విభాగంలో దాదాపు 30 ఏళ్ల పాటు అధ్యాపకుడిగా పని చేశారు. ఆయన ఉద్యోగ విరమణ పొందాక యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, నైపర్, ఫార్మసీ సంస్థలో అతిథి ఆచార్యులుగా పని చేశారు. లక్ష్మీపతి మృతికి కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, జువాలజీ విభాగాధిపతి మామిడాల ఇస్తారి సంతాపం తెలిపారు.

ఇద్దరికి జీవిత ఖైదు

నర్సింహులపేట: చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలో 2014లో కుటుంబ తగాదాలతో కుంట యాదగిరిని హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులకు సోమవారం మహబూబాబాద్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై మంగీలాల్ తెలిపారు. యాదగిరి హత్యకు గురైనట్లు డిసెంబర్ 2014లో ఆయన కుమారుడు నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన కుంట సురేశ్, చిల్ల ఉప్పలయ్యను నిందితులుగా పేర్కొని జిల్లా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితులిద్దరికీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రూ.1000 జరిమానా, జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈకేసులో ట్రయల్ నడిపిన పీపీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రఘు, సీఐ సత్యనారాయణ, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎండి.గాలీబ్, ఎస్సై మంగీలాల్, కోర్టు పీసీ నరేందర్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఈ'సారీ' లోటే!



- కేయూ అంచనా బడ్జెట్ రూ.389 కోట్లు!
- రూ.15 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపే అవకాశం
- నేడు అకాడమిక్ సెనేట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ, ఆమోదం

కేయూ క్యాంపస్: కేయూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక అంచనాల బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశపెట్టబోతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం 11 గంటలకు 38వ అకాడమిక్ సెనేట్‌లో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈబడ్జెట్‌లో ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణారూ 127.55 కోట్లు రానున్నాయి. ఆనిధులు అధ్యాపకుల, నాన్‌టీచింగ్, పెన్షనర్ల జీతభత్యాలకే సరిపోనున్నాయి. మిగతా అంచనా బడ్జెట్‌కు అనుగుణంగా కేయూ అంతర్గత నిధుల నుంచి, పరీక్షల విభాగం, ఎస్‌డీఎల్‌సీఈ, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల నుంచి ఇతర అకాడమిక్ పరంగా ఫీజుల వనరుల నుంచి సమీకరించబోతున్నారు. ఆయా నిధులను వ్యయాలుగా చూపెట్టబోతున్నారు. ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌గా 8 అంశాల్లో బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్ అధ్యాపకుల, ఉద్యోగుల వేతనాలకే సరిపోతుండగా.. టైంస్కేల్, తాత్కాలిక ఉద్యోగులకు మాత్రం.. యూనివర్సిటీ తన అంతర్గత నిధుల నుంచే వేతనాలను చెల్లించుకోవాల్సిన పరిస్థితి. టీచింగ్, నాన్‌టీచింగ్ పెన్షనర్ల బెనిఫిట్స్‌ను కూడా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచే ఇవ్వాల్సి వస్తోంది. ఆబెనిఫిట్స్ ఇవ్వడంలోనూ జాప్యం అవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్‌తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో బ్లాక్ గ్రాంట్ రూ.9.34 కోట్లు పెరిగింది. అయినప్పటికీ ఇది సరిపోదు. అలాగే.. అధ్యాపకుల, ఉద్యోగులకు పీఆర్సీతో వేతనాలు పెరిగాయి. డీఏలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. రూ.15 కోట్లకు పైగా లోటు బడ్జెట్‌ను చూపెట్టబోతున్నట్లు సమచారం. కాగా.. అన్ని కోర్సులకు ఫీజులు భారీగానే పెంచారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే కొంత యూనివర్సిటీకి ఊరట కలిగే అవకాశం ఉంది.

అకాడమిక్ కార్యక్రమాలపై చర్చేది?

కేయూలో సెనేట్ సభ్యుల కొరత ఉంది. యూనివర్సిటీకి 16 ఏళ్ల క్రితం సెనేట్ సభ్యులను నియమించారు. కనీసం ఐదారేళ్లకోసారి సెనేట్ సభ్యులను నియమించాల్సి ఉంటుంది. కానీ రీ ఆర్గనైజ్ చేయడం లేదు. పలువురు సెనేట్ సభ్యులు మరణించినా.. వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలేదు. సెనేట్‌ను కొత్తగా పునరుద్ధరించాలనే డిమాండ్ వ్యక్తం అవుతున్నా.. యూనివర్సిటీ అధికారులు అంతగా.. పట్టించుకోవడం లేదు. అకాడమిక్ సెనేట్, బడ్జెట్‌ను కలిపి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టాక కొద్దిసేపు చర్చించిన అనంతరం చప్పట్లతో ఆమోదించినట్లుగా ప్రకటిస్తున్నారు. అకాడమిక్ కార్యక్రమాలకు విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా చర్చించాలనేది ప్రతీ సెనేట్ సమావేశంలో పలువురు అభిప్రాయపడుతున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు ఓకే అనడం ఆతర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. అకాడమిక్ సెనేట్‌లో ఎప్పుడూ పూర్తి స్థాయిలో అకాడమిక్ కార్యక్రమాలపై చర్చలు జరగలేదంటే అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 45 మంది అకాడమిక్ సెనేట్ సభ్యులున్నట్లు తెలుస్తోంది. అందులో ఎంతమంది హాజరవుతారో మంగళవారం తెలియనుంది.

రూ.22 కోట్లు పెరిగిన బడ్జెట్!

గత ఆర్థిక సంవత్సరం 2022–23లో రూ.367 కోట్లకుపైగా.. అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే.. ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణా రూ.188.22 కోట్లు యూజీసీ ఏరియర్స్ రూ 32.81 కోట్లు మరో రూ.183.60 కోట్లు అంతర్గత నిధుల నుంచి సమీకరిస్తారని అంచనా బడ్జెట్‌లో పేర్కొన్నారు. లోటు రూ.33 కోట్లు చూపెట్టారు. అయితే ఆర్థిక సంవత్సరంలో రూ.211 కోట్లకు పైగా వ్యయం అయినట్లుగా తెలుస్తోంది. కాగా.. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటులో రూ.15.50 కోట్లు విడుదల చేయలేదని తెలుస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌లో రూ.389 కోట్లకు పైగా అంచనా ప్రతిపాదించి ప్రవేశపెట్టి అందులో ఆదాయ వ్యయాలను కూడా అంచనా వేశాక సుమారు రూ.15 కోట్లకు పైగానే లోటు బడ్జెట్ ఉండబోతోందని తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.22 కోట్లకుపైగా ఈఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పెంచినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి ఇచ్చే నిధులకంటే వ్యయం ఎక్కువగా ఉంటుంది. అభివృద్ధి పనులకు గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు.

బడ్జెట్, వార్షిక నివేదిక, స్టాండింగ్ కమిటీ మినిట్స్

- కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కేయూ సెనేట్‌హాల్‌లో ఈనెల 28న ఉదయం 11గంటలకు జరిగే 38వ అకాడమిక్ సెనేట్ సమావేశంలో పద్దుల ఆమోదం, వార్షిక నివేదిక, వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని సోమవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో 2020–2021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పద్దుల ఆమోదం, 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను కూడా ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థికి ఫిట్స్

ఎంజీఎంకు తరలింపు


చికిత్స పొందుతున్న విద్యార్థి ధరణి

ఎంజీఎం: వరంగల్ ఏవీవీ కళాశాలలో మేధా ఇంటర్మీడియట్ కళాశాలకు చెందిన ధరణి సోమవారం ఇంటర్ పరీక్ష రాస్తున్న క్రమంలో ఫిట్స్ వచ్చింది. కళాశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లి చికిత్స అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కూతురును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

సంగెం: కుటుంబ సమస్యలు, వడగండ్ల వానతో పంట నష్టం ఇవన్నింటితో జీవితంపై విరక్తి చెందిన మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కొలువుల నీల(52) ఆదివారం రాత్రి కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. నీల కుమారుడికి రెండేళ్ల క్రితం ఏనుగల్లు గ్రామానికి చెందిన రవళికతో వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం బాగలేక రూ.3 లక్షలు చికిత్స కోసం ఖర్చయ్యాయి. కాగా.. కుమారుడికి విడాకులు ఇవ్వాలనుకున్నారు. ఇరు వర్గాల పెద్ద మనుషుల తీర్పు ప్రకారం.. రూ. 20 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. కాగా.. మూడెకరాల పది గుంటల భూమిని కౌలుకు తీసుకుని అందులో మిర్చి, మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవలి వడగండ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కోడలు విడాకుల కోసం రూ. 20 లక్షలు, పంటల కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి సీతారాంనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

మృతదేహం లభ్యం


నీల మృతదేహం

చెన్నారావుపేట: మండలంలోని సూర్యపేట తండా సమీపంలోని ఎస్సారెస్పీ (డీబీఎం–40) కాలువలో సోమవారం ఉదయం నీల మృతదేహం లభ్యమైంది. అద్దబాట తండాకు చెందిన రైతు వాల్యానాయక్ కొట్టుకొస్తున్న మృతదేహాన్ని ఆపి తాడు సాయంతో సమీపంలో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై తోట మహేందర్ మృతదేహాన్ని పరిశీలించారు.

తాగొద్దన్నందుకు..

శాయంపేట: మద్యం తాగొద్దని భార్య వారించినందుకు మండలంలోని మందారిపేట గ్రామానికి చెందిన కుక్కల సతీశ్ (33) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సతీశ్ గొర్రెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయాన్నే మద్యం సేవించిన సతీశ్ ఇంటికి రావడంతోనే అతడి భార్య నాగరాణి గొర్రెలను మేపకుండా మద్యం తాగడం ఎందుకని? మద్యం సేవించవద్దని మందలించింది. నాగరాణి, ఆమె అత్త లింగమ్మ ఇద్దరూ గొర్రెలను మేపేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి సతీశ్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు..


కార్తీక్(ఫైల్)

జనగామ: జనగామ జిల్లా యశ్వంతాపూర్ వాగు వద్ద రైలు కింద పడి భువనగిరి యాదాద్రి జిల్లా ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామానికి చెందిన కార్తీక్(21) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్నెళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందిన తండ్రిని తలుచుకుంటూ.. మానసిక వేదనకు గురైన కార్తీక్ సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

తీర్థయాత్రకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!

- కోనాపురంలో దొంగల బీభత్సం
- 10 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ


పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: ఈనెల 17న కుమారుడి వివాహం జరిగింది. నూతన వధూవరులతో ఆ కుటుంబం తీర్థయాత్రలకు వెళ్లింది. వచ్చేసరికి దొంగలు ఉన్నదంతా ఊడ్చుకెళ్లారు. మండలంలోని కోనాపురానికి చెందిన మండల సుధాకర్ ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. శోభ–సుధాకర్ దంపతులు ఈనెల 17న తమ కుమారుడు నాగరాజు వివాహాన్ని జరిపించారు. నూతన వధూవరులను తీసుకొని వేములవాడకు ఆదివారం వెళ్లారు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతీరాం నాయక్, ఎస్సై తోట మహేందర్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో చోరీ తీరుపై విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ అధికారులు వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

బైక్ ఒకరిది.. జరిమానా మరొకరికి!

- డీజీపీకి ట్విట్టర్‌లో జనగామ వాసి ఫిర్యాదు



డీజీపీకి సంపత్ ట్విట్టర్‌లో చేసిన ఫిర్యాదు


జరిమానా చెల్లించాలని ట్రాఫిక్ పోలీసులు పంపించిన చలాన్

జనగామ: తప్పు చేసింది ఒకరు.. జరిమానా చెల్లించాలని నోటీసులు మరొకరికి. ఈట్విస్ట్‌ను ట్విట్టర్‌లో డీజీపీకి జనగామ వాసి ఫిర్యాదు చేశారు. జనగామలోని జయశంకర్‌నగర్‌కు చెందిన పబ్బా సంపత్‌కు (టీఎస్ 27 సీ4258) నంబర్‌గల ద్విచక్ర వాహనం ఉంది. స్థానికంగా ఉండే సంపత్ ఈమధ్య కాలంలో బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లలేదు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్టేషన్ పరిధిలో ఓ స్కూటీ యజమాని వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో పాటు విరిగిపోయిన నంబర్ ప్లేట్ కనిపించడంతో పోలీసులు రూ.7వందల జరిమానా విధించారు. కానీ ఆన్‌లైన్‌లో స్కూటీ నెంబర్ ప్లేట్ విరిగి ఉన్న ఫోటోను పోస్టు చేసి, జరిమానా మాత్రం జనగామకు చెందిన సంపత్‌కు మెసేజ్ పంపించారు. దీన్ని చూసి ఆందోళన చెందిన సంపత్... నేరుగా డీజీపీకి ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. ‘అయ్యా డీజీపీ గారు... బండి నంబర్ కనిపించకపోతే ఎవరికి పడితే వారికి జరిమానా విధిస్తారా? మీరు ఆన్‌లైన్‌లో పోస్టు చేసిన బైక్ మాది కాదు.. సరి చూసుకోండి’ అంటూ ట్వీట్ చేశారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్ట్

- పరారీలో ఒకరు


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేటలో సోమవారం 2.100 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన మహాద్ నజీమ్, జమ్మికుంటకు చెందిన పాకాల విక్రత్‌రెడ్డి, సాహెబ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో విక్రత్‌రెడ్డి, నజీమ్‌లను పోలీసులు అరెస్ట్ చేయగా.. సాహెబ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఐలు కె.శ్రీనివాస్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు లవన్‌కుమార్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు

ఖిలా వరంగల్: వారసత్వంగా వచ్చే ఆస్తి విషయంలో అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట నెహ్రూ విగ్రహం సమీప కాలనీకి చెందిన గుమ్మడి ఇందిర తల్లిదండ్రుల ఆస్తి విషయంపై అతడి తమ్ముడు మునికుంట్ల ఆగయ్యతో సోమవారం గొడవ జరిగింది. ఈగొడవల్లో అక్కపై తమ్ముడు దాడి చేశాడు. ఆగయ్యపై ఇందిర ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: మామ ఇంటిపై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్న అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ ఏరియా గాంధీనగర్‌లో చింతపండు సంజీవ్‌కు ఇల్లు ఉంది. అతడి అల్లుడైన లక్కం ప్రసాద్ మామ ఇంటిని కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మామను బెదిరిస్తున్నాడు. దీంతో చింతపండు సంజీవ్ చిన్నాన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం బలరాం తండాకు చెందిన లకావత్ భాస్కర్ ఎనిమిదేళ్ల కుమారుడు జశ్వంత్ పై వీధి కుక్క ఆదివారం రాత్రి దాడి చేసింది. ఈదాడిలో బాలుడి జననేంద్రియానికి తీవ్రగాయమైంది. ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా.. వీధి కుక్క జశ్వంత్‌పై దాడి చేసింది. వెంటనే అతడిని తండ్రి భాస్కర్ చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించారు.


వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు.


ధనసరి చిన్న లక్ష్మయ్య(ఫైల్)

గంగారం: తాటి కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం జంగాలపల్లికి చెందిన ధనసరి చిన్న లక్ష్మయ్య(50) చికిత్స పొంది ఇంటికి రాగానే ఆదివారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భూమిలో ఉన్న తాటి చెట్లను ఆయన ఎక్కి కల్లు తీసి అమ్ముతున్నాడు. అయితే.. ఉగాది పండుగను పురస్కరించుకుని లక్ష్మయ్య వ్యవసాయ భూమిలోని తాటిచెట్లు ఎక్కి కల్లు దింపి ఇంటికి తీసుకొచ్చాడు. ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురు కలిసి కల్లు తాగారు. ఈక్రమంలో లక్ష్మయ్య, రాజశేఖర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. ఈక్రమంలో రాజశేఖర్ కోలుకోగా.. రోజు రోజుకూ లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. వైద్యులు బతకడం కష్టమే ఇంటికి తీసుకెళ్లాలని సూచించడంతో లక్ష్మయ్యను ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి ఇంట్లోనే మృతి చెందాడు. తాటి చెట్టుపై ఉన్న కల్లులో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య సారక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు..


థావుర్యా(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ మహబూబాబాద్ మండలం వేంనూర్ గ్రామ శివారు రాముత్య తండాకు చెందిన బానోత్ థావుర్యా(45) సోమవారం మృతి చెందాడు. థావుర్యాకు మూడెకరాల భూమి ఉంది. అందులో మిర్చి, రెండెకరాల వరి సాగు చేశాడు. పంటల సాగు కోసం రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురై ఈనెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆయనను మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు..

కాశిబుగ్గ: వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య అబ్బనికుంట మైసమ్మ దేవాలయం సమీపం రైలు ఢీకొని గుర్తు తెలయని వ్యక్తి(40–45) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా.. ఏదో రైలు నుంచి పడడం వల్ల మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహంపై బూడిద కలర్ ప్యాంట్, వైట్‌కలర్ ఫుల్ షర్ట్ ఉన్నట్లు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు వివరాలకు 9441557232లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

నిట్‌లో ‘మీటర్’ సందడి

ఉత్సాహం నింపిన సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య


విద్యార్థుల కేరింతలు


విద్యార్థులతో మాట్లాడుతున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం మీటర్ సినిమా హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి సందడి చేశారు. నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని వేడుకల్లో భాగంగా మీటర్ మూవీ హీరో, హీరోయిన్లు తమ సినిమా ప్రమోషన్లో భాగంగా నిట్‌లో విద్యార్థులతో చిట్‌చాట్ చేసి అలరించారు. స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని ఫిల్మ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటర్ సినిమా హీరో, హీరోయిన్ల లెట్స్ టాక్ షోలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిట్ విద్యార్థిని మేరి అడిగిన ప్రశ్నలతో పాటు విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. ‘మాది వ్యవసాయ కుటుంబం. పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చా. నేను తిరుపతిలో బీటెక్ చదువుతున్న తరుణంలో నా డ్రెస్సింగ్ చూసి వీడు వరెస్ట్ అని క్లాస్‌లోకి రానిచ్చేవారు కాదు. నాఫ్రెండ్స్ కూడా నన్ను వరెస్ట్ అని అనే వారు. కానీ చాలెంజ్‌గా తీసుకుని బెస్ట్‌గా ఎదిగాను’ అన్నారు.

నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి..

‘నేను తమిళ్ ఇండస్ట్రీ నుంచి తెలుగు ఇండస్ట్రీలో చేస్తున్న తొలి సినిమా మీటర్. ఏప్రిల్ 7న రిలీజ్ అవుతుంది, నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి. మూవీస్ చేస్తునే బీటెక్ పూర్తి చేసి ఎంటెక్ పూర్తి చేశాను. మీరంతా విద్యకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాకే.. ఇష్టమైన రంగాన్ని ఎంచుకోండి’ అని మీటర్ హీరోయిన్ అతుల్య రవి అన్నారు.

కలర్‌ఫుల్‌గా ఎథికల్ నైట్

నిట్ వరంగల్‌లోని టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో సోమవారం రాత్రి స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో భాగంగా సెంటర్‌ఫర్ వ్యాల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎథికల్ నైట్ కలర్‌ఫుల్‌గా సాగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఎత్నిక్‌వేర్ పేరిట నిర్వహించిన ప్రోగ్రాంలో అలరించారు. ఆరోహన్ డ్రామా పేరిట బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్, హీరోయిన్ దీపిక పదుకునే నటించిన ఓం శాంతి ఓం చిత్రాన్ని నాటక రూపంలో ఆవిష్కరించారు. ఆకాశంలోకి దీపాలను వదిలి లాంతర్ నైట్‌ను కలర్‌ఫుల్‌గా మార్చారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు దంపతులు విద్యార్థులకు జోష్‌ను అందించేలా చేపట్టిన ర్యాంప్‌వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.